క్లుప్తంగా

స్పోర్ట్స్‌ అథారిటీ చైర్మన్‌తో భేటీ



రాష్ట్ర స్పోర్ట్స్‌ అథారిటీ చైర్మన్‌ను సన్మానిస్తున్న శేరి సతీష్‌ రెడ్డి, కాంగ్రెస్‌ నాయకులు

మోతీనగర్‌: స్పోర్ట్స్‌ అథారిటీ చైర్మన్‌ శివసేన రెడ్డితో కూకట్‌పల్లి కాంగ్రెస్‌ నియోజకవర్గ మాజీ అధ్యక్షులు శేరి సతీష్‌ రెడ్డి గురువారం సమావేశమయ్యారు. నియోజకవర్గంలో క్రీడా ప్రాంగణాల అభివృద్ధి, యువతకు ప్రోత్సాహం తదితర విషయాలపై చర్చించారు. సమావేశంలో తమ్మినేని ప్రవీణ్‌కుమార్‌, కృష్ణరాజపుత్‌, రేష్మ, మస్తాన్‌ రెడ్డి, కిట్టు, పవన్‌, శ్రీధర్‌ చారి, రామకృష్ణా రెడ్డి, గిరి నాయుడు, రవూఫ్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి శనివారం ఉచిత రెటినోపతి పరీక్షలు

బాలానగర్‌: బాలానగర్‌లోని లయన్స్‌ కంటి హాస్పిటల్‌లో ప్రతి శనివారం ఉచిత దయాబెటిక్‌, రెటినోపతి స్కీనింగ్‌ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు హాస్పిటల్‌ ప్రతినిధి జంపాల రాఖేష్‌ గురువారం తెలిపారు. శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

వైభవంగా 108 కలశాల పూజ



కూకట్‌పల్లి: కూకట్‌పల్లి స్వాన్‌లేక్‌లో శ్రీ వరసిద్ధి వినాయక వార్షికోత్సవ వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. పూజల్లో రెండవ రోజు గురువారం 108 కలశాలలో పంచామృతాలు, పంచ ద్రవ్యాలతో వరసిద్ధి వినాయకుడికి అంగరంగ వైభవంగా మహా అభిషేకం నిర్వహించారు. హోమాలు జరిగాయి. స్వాన్‌లేక్‌లో వాసవి గ్రూప్‌ వారు భక్తులకు ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మల్లూరు కృష్ణమూర్తి, డీడీ రెడ్డి, రాజేశ్వర్‌, చలపతి పాల్గొన్నారు.

వాటర్‌వర్క్స్‌ ఎండీకి వినతి

ఓల్డ్‌ బోయిన్‌పల్లి: డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీ, మంచినీటి పైపులైన్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని నాయకులు కోరారు. ఈ మేరకు ఎంపీ ఈటల రాజేందర్‌ ఇచ్చిన అభివృద్ధి పనుల ప్రతిపాదనతో కూడిన లెటర్‌, కాలనీవాసుల వినతిపత్రంను వాటర్‌ వర్క్స్‌ ఎండీ అశోక్‌రెడ్డికి గురువారం అందజేశారు. నిధులు మంజూరుకు ఎండీ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎనుగుల తిరుపతియాదవ్‌, సత్యమూర్తి, కాసు అశోక్‌, రమేష్‌, అరుణ్‌, రాజు, మల్లేష్‌, బాలరాజు పాల్గొన్నారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య



లక్ష్మీ నారాయణ (ఫైల్‌)

మూసాపేట: ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... ఒరిస్సాకు చెందిన కంచరాల లక్ష్మీనారాయణ (56) భార్య కాంతమ్మ 15 సంవత్సరాల క్రితం నగరానికి వలస వచ్చి మూసాపేటలోని యాదవబస్తీలో నివాసం ఉంటున్నారు. ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. హమాలీ పని చేస్తూ ఉండేవాడు. తాగుడికి బానిసై అప్పుడప్పుడు పనికి వెళ్లేవాడు. గురువారం ఉదయం ఇంట్లో అందరూ బయటకు వెళ్లాక ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. స్థానికుల సమాచారంతో కొడుకు ఇంటికి వచ్చి ఆసుపత్రికి తీసుకెళ్లగా.. చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు,రేపు చార్మినార్‌ సర్కిల్‌ అటవీ శాఖ క్రీడా పోటీలు

సుభాష్‌నగర్‌: అటవీ శాఖ చార్మినార్‌ సర్కిల్‌ ప్రాంతీయ క్రీడా పోటీలు ఈ నెల 10, 11 తేదీల్లో దూలపల్లిలోని తెలంగాణ రాష్ట్ర అటవీ అకాడమీలో జరుగనున్నాయి. పరుగు పందెం, నడకపోటీ, వెయిట్‌ లిఫ్టింగ్‌, షటిల్‌, క్యారమ్స్‌, చెస్‌, లాన్‌టెన్నీస్‌, టేబుల్‌ టెన్నీస్‌, రైఫిల్‌ షూటింగ్‌, అర్చరీ, వాలీబాల్‌, బాస్కెట్‌ బాల్‌, కబడ్డీ, హాకీ, టగ్‌ ఆఫ్‌ వార్‌, సైక్లింగ్‌, మారథాన్‌ తదితర పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీలను రాష్ట్ర అటవీ ముఖ్య ప్రధాన సంరక్షణాధికారి డాక్టర్‌ సి.సువర్ణ, చీఫ్‌ వైల్డ్‌లైఫ్‌ వార్డెన్‌ ఎలుసింగ్‌ మేరు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించనున్నారు.

రోడ్లే పార్కింగ్‌ అడ్డాలు!

కాలనీలో అడ్డదిడ్డంగా వాహనాల నిలిపివేత



పర్వత్‌నగర్‌లో ఇష్టానుసారంగా రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్‌ చేసిన వాహనాలు

మోతీనగర్‌: బస్తీ, కాలనీలలో అసలే ఇరుకైన రోడ్లు. ఆ రోడ్లుకు ఇరువైపులా వాహనాలను ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్‌ చేయడంతో రాత్రి వేళల్లో ఇళ్లల్లోకి రావాలన్నా ఆలోచించాల్సిన పరిస్థితి నెలకొంది. పర్వత్‌నగర్‌ ఫేజ్‌ టులో కొన్ని రోజుల నుంచి ద్విచక్ర వాహనాలు, కార్లు, ఇతర వాహనాలు ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్‌ చేస్తున్నారు. అంబులెన్స్‌, పెట్రోలింగ్‌ వాహనం రావడానికి వీలు లేకుండా ఉంది. కేవలం పర్వత్‌నగర్‌లోనే కాకుండా వివిధ బస్తీ, కాలనీల్లో పరిస్థితి ఇదే విధంగా నెలకొంది. రాత్రి వేళల్లో వాహనాలు ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్‌ చేయడంతో సమీప నివాసితులు బయటకు రావాలన్నా, ఇంటిలోకి వెళ్లాలన్నా ఆలోచించాల్సిన పరిస్థితి నెలకొంది. ట్రాఫిక్‌ పోలీసులు కేవలం ప్రధాన చౌరస్తాలో వీవీఐపీల పర్యటన ఉన్నప్పుడు మాత్రమే దర్శనమిస్తున్నారు. వివేకానందనగర్‌, గాయత్రి నగర్‌, తులసి నగర్‌, అల్లాపూర్‌, పర్వత్‌నగర్‌, వి. రామారావు నగర్‌, శ్రీ గణేష్‌ నగర్‌, రాధాకృష్ణ నగర్‌లతో పాటు వివిధ బస్తీ, కాలనీల్లో నిరంతరం రోడ్లపైనే వాహనాలను పార్కింగ్‌ చేస్తుంటారు. ఇటీవల పార్కింగ్‌కు ఖాళీ స్థలం ఎక్కడ కనిపిస్తే అక్కడ పార్కింగ్‌ చేయటంతో రాకపోకలకు ఇబ్బందికరంగా తయారైంది. ట్రాఫిక్‌ పోలీసులు మొబైల్‌ వాహనం కూడా ప్రధాన వీధుల్లో వెళ్లడానికి వీలు లేకుండా పార్కింగ్‌ చేస్తున్నారు. ఇదేమని ఎవరైనా అడిగితే దాడులకు సైతం దిగుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి అడ్డదిడ్డంగా పార్కింగ్‌ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



పాండురంగనగర్‌లో బస్టాప్‌లో..



మోతీనగర్‌ రోడ్డులో..

నాటు సారా విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్‌

- 10 లీటర్ల సారా, ద్విచక్ర వాహనం స్వాధీనం
- కేసు నమోదు..రిమాండ్‌కు తరలింపు



నాటు సారా విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్‌ చేసిన శంషాబాద్‌ ఎస్‌టీఎఫ్‌ పోలీసులు

చందానగర్‌ : నాటు సారా విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను శంషాబాద్‌ డిస్ట్రిక్ట్‌ టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు అరెస్ట్‌ చేశారు. ఎక్సైజ్‌ పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు...నానక్‌రాంగూడకు చెందిన బజార్‌వాలె కిషన్‌సింగ్‌ అతని భార్య బజార్‌వాలె రేఖాబాయిలు కలిసి ధూల్‌పేట్‌కు చెందిన రాధికా బాయి, శంకర్‌ల వద్ద నుంచి సుమారు 10 లీటర్ల నాటు సారాను కొనుగోలు చేసి నానక్‌రాంగూడలోని కూలీలకు విక్రయిస్తున్నారు. ఒక లీటర్‌ రూ.400లకు అమ్ముతున్నారు. విషయం తెలుసుకున్న శంషాబాద్‌ డీటీఎఫ్‌ పోలీసులు, రంగారెడ్డి డీసీ దశరథ్‌, శంషాబాద్‌ ఎక్సైజ్‌ సూపరింటెండెంట్‌ కృష్ణ ప్రియ ఆదేశాల మేరకు అసిస్టెంట్‌ సూపరింటెండెంట్‌ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం నాటు సారా విక్రయిస్తున్న కిషన్‌సింగ్‌ దంపతులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 10 లీటర్ల నాటు సారాతో పాటు ఒక హోండా యాక్టివా స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిద్దరిని శేరిలింగంపల్లి మండల ఎక్సైజ్‌ పోలీస్‌ స్టేషన్‌ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులను నిందితులిద్దరిని రిమాండ్‌కు తరలించారు. ఈ దాడులలో డీటీఎఫ్‌ సీఐ ప్రవీణ్‌ కుమార్‌, ఫక్రుద్దీన్‌, మలేష్‌, నెహ్రూ, శేఖర్‌ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో తప్పిపోయిన బాలుడు



నిజాంపేట్‌: నిజాంపేట్‌ పెట్రోల్‌ పంప్‌ వద్ద 4సంవత్సరాల బాలుడు తప్పిపోయి తచ్చాడుతూ బాచుపల్లి పెట్రోలింగ్‌ పోలీసులకు గురువారం కనిపించాడు. ఆ బాలుడిని పోలీసులు తీసుకున్నారు. పూర్తి వివరాల కోసం అడుగగా.. ఆ బాలుడు చేప్పలేక పోతున్నాడు. దీంతో ఆ బాలుడిని బాచుపల్లి పోలీస్‌ స్టేషన్‌కు తరలించి సంరక్షించారు. బాలుడి వివరాలు తెలిసినవారు బాచుపల్లి పోలీస్‌ స్టేషన్‌లో సంప్రదించాలని, ఎస్సై రాజశేఖర్‌రెడ్డి ఫోన్‌ నెంబర్‌ 8712568334లో సంప్రదించి బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించడంలో సహకరించాలని బాచుపల్లి పోలీసులు విజ్ఞప్తి చేశారు.

బ్రెస్ట్‌ కేన్సర్‌పై అవగాహన



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్లు

మాదాపూర్‌: మహిళల్లో కేన్సర్‌పై అవగాహన పెంపొందించి ప్రారంభదశలోనే గుర్తించాలని గైనకాలజిస్టు డాక్టర్‌ ఎల్‌. జయంతిరెడ్డి తెలిపారు. మాదాపూర్‌లోని మెడికవర్‌ ఆసుపత్రిలో గురువారం బ్రెస్ట్‌ క్యాన్సర్‌ అవగాహన నెల సందర్భంగా ఉచిత క్యాన్సర్‌ స్క్రీనింగ్‌ కూపన్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించడం వల్ల ప్రాణాలు రక్షించవచ్చని తెలిపారు. ఉచిత స్క్రీనింగ్‌ కూపన్లు అక్టోబర్‌ 31 నుంచి మెడికవర్‌ కేన్సర్‌ హాస్పిటల్‌లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. బ్రెస్ట్‌ కేన్సర్‌ పరీక్ష, పాప్‌స్మియర్‌, కంప్లీట్‌ బ్లడ్‌ పిక్చర్‌ తదితర పరీక్షలు ఉచితంగా చేస్తారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్‌ సబిత తదితరులు పాల్గొన్నారు.

దశలవారీగా సమస్యల పరిష్కారం

రాయదుర్గం: గోపన్‌పల్లిలో త్వరలోనే పర్యటించి దశలవారీగా సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే గాంధీ స్పష్టం చేశారు. గురువారం గచ్చిబౌలి కార్పొరేటర్‌ గంగాధర్‌రెడ్డి ఆధ్వర్యంలో గోపన్‌పల్లివాసులు ఎమ్మెల్యేను కలిసి స్థానిక సమస్యలను వివరించి పరిష్కరించాలని కోరారు. దీనిపై ఆయన స్పందిస్తూ అవసరమైన చోట రోడ్లు, యూజీడీ పైప్‌లైన్‌లు ఏర్పాటు చేయిస్తామన్నారు. అంసపూర్తి రోడ్డు పనులు పూర్తయ్యేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు గౌతమ్‌గౌడ్‌, దాత్రినాథ్‌గౌడ్‌, యాదగిరిగౌడ్‌, అనిల్‌, నర్సింహ, శ్రీరామ్‌రెడ్డి, నర్సింగ్‌రావు, సత్యనారాయణ, జితేందర్‌, రాజేందర్‌, కాలనీవాసులు పాల్గొన్నారు.

కమ్యూనిటీహాల్‌ నిర్మించాలని వినతి

చందానగర్‌ : హఫీజ్‌పేట్‌ డివిజన్‌ పరిధిలోని ప్రకాష్‌నగర్‌లో సగర (ఉప్పర) సంఘం కమ్యూనిటీహాల్‌ నిర్మించాలని గురువారం ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీని కాలనీవాసులు కలిసి వినతిపత్రం అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కమ్యూనిటీహాల్‌ నిర్మాణం కొరకు తన వంతు సహాయ సహకారాలు ఉంటాయన్నారు.

ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు






ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌ను హౌస్‌ అరెస్టు చేసిన పోలీసులు

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- బస్‌ భవన్‌ ముట్టడికి వెళ్లకుండా బీఆర్‌ఎస్‌ శ్రేణుల హౌస్‌ అరెస్టులు

కూకట్‌పల్లి(జోన్‌బృందం): బీఆర్‌ఎస్‌ తలపెట్టిన చలో బస్‌భవన్‌ పిలుపునిచ్చిన నేపథ్యంలో గురువారం నియోజకవర్గ వ్యాప్తంగా బీఆర్‌ఎస్‌ శ్రేణులను పోలీసులు హౌస్‌ అరెస్టు చేశారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌, కార్పొరేటర్‌లు, నాయకులను పోలీసులు ముందస్తు హౌస్‌ అరెస్టు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ.. ఆర్టీసీ చార్జీల పెంపునకు నిరసనగా చలో బస్‌ భవన్‌ కార్యక్రమానికి వెళ్లకుండా అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి సంకెళ్లు వేయడమేనన్నారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం నిరంకుశ పాలనకు గుణపాఠం తప్పదని హెచ్చరించారు.



కూకట్‌పల్లి కార్పొరేటర్‌ జూపల్లి సత్యనారాయణను అదుపులోకి తీసుకున్న పోలీసులు



అల్లాపూర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ సబిహా బేగంను హౌస్‌ అరెస్టు చేసిన పోలీసులు

కాలనీలో వసతుల కల్పనకు కృషి



కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌తో కాలనీవాసులు

ఆల్విన్‌కాలనీ: వెంకట పాపయ్య నగర్‌ కాలనీలో వసతుల కల్పనకు కృషి చేస్తానని కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌ అన్నారు. గురువారం అసోసియేషన్‌ ప్రెసిడెంట్‌ జూపల్లి జనార్ధన్‌రావు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు కలిసి సమ్యలు వివరించారు. పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణ పనులను పూర్తి చేయాలని కోరారు.

అనంతరం కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. కాలనీ వాసులు కోరిన విధంగా పెండింగ్‌ పనులను పూర్తి చేసేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో దేవేందర్‌, జీవన్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, వెంకటస్వామి గౌడ్‌, నరసింహులు, మహేందర్‌రావు, దయాకర్‌, బాలాజీ, విక్కీ తదితరులు పాల్గొన్నారు.

పొగాకు ముక్త్‌ భారత్‌లో భాగస్వాములవ్వాలి

డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ ఉమాగౌరి



కార్యక్రమంలో పాల్గొన్న డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ ఉమాగౌరీ, అధికారులు, ఉపాధ్యాయులు

కూకట్‌పల్లి: పొగాకు ముక్త్‌ భారత్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ ఉమాగౌరి అన్నారు. వరల్డ్‌ నో టుబాకో డే సందర్భంగా కూకట్‌పల్లి జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో పొగాకు వినియోగం, పరిణామాలు, ఆరోగ్యం, పొగాకు ముక్త్‌ భారత్‌ను నిర్మిద్దాం అనే నినాదంతో కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆమె మాట్లాడారు. టుబాకో ముక్తి భారత్‌ అనే నినాదం వెనుక పొగాకు రహిత భారతదేశం అనే లక్ష్యం ఉందని, దీని కోసం భారత ప్రభుత్వం జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమాన్ని 2007-08లో ప్రారంభించిందని తెలిపారు. పాఠశాలల నుంచి 100 మీటర్ల వరకు టుబాకో నిషేధిత ప్రాంగణంగా ప్రకటించాలని, తదనుగుణంగా బ్యానర్లు, అవగాహన పోస్టర్లను ప్రదర్శించాలని కోరారు. అనంతరం విద్యార్థులతో భవిష్యత్‌ తరాల కోసం పొగాకు ముక్త్‌ భారత్‌ నిర్మిద్దాం అనే నినాదాన్ని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్‌ డాక్టర్‌ మల్లీశ్వరి, మెడికల్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ మమత, కోఆర్డినేటర్‌ ఉమాపతి, ఉపాధ్యాయులు రామ్మోహన్‌రావు, వీఎస్‌ఎస్‌ శర్మ, దామోదర్‌ రెడ్డి, ప్రవీణ్‌కుమార్‌, సుజాత, గాయత్రి, సక్కుబాయి తదిరతులు పాల్గొన్నారు.

మూడు నెలలుగా మూతే..





ఇండోవేషన్‌ సెంటర్‌, సెంటర్‌ ఆఫ్‌ ఎక్సలెన్స్‌ ఇన్‌ఫ్యూచర్‌ టెక్నాలజీస్‌

బాలానగర్‌: జేఎన్‌టీయూలోని రెండు సెంటర్లు కొంత కాలంగా ఆఫీసుల తలుపు తీయటం లేదు. అవి పని చేస్తునాయో? లేదో? ఎవరికీ తెలియని పరిస్థితి. విశ్వ విద్యాలయంలోని విద్యార్థులకు కూడా తెలియదు. ఇండోవేషన్‌ సెంటర్‌, సెంటర్‌ ఆఫ్‌ ఎక్సలెన్స్‌ ఇన్‌ఫ్యూచర్‌ టెక్నాలజీస్‌ కేంద్రాలు మూడు నెలలుగా మూసివేసి ఉన్నాయి. ఈ విషయంపై సంబంధిత డైరెక్టర్‌కు ఫోన్‌ చేయగా స్పందించలేదు.

12న ‘సండే ఈవినింగ్‌ టాక్‌’

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్‌ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం ‘సండే ఈవినింగ్‌ టాక్‌ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ‘చూజింగ్‌ ఫీలింగ్స్‌’ అనే అంశంపై హైదరాబాద్‌కు చెందిన సీనియర్‌ రాజయోగ టీచర్‌ బి.కె.రుచి ఉపన్యాసం ఇస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్‌ నంబర్‌ 040-23001234లో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

మోతీనగర్‌: గర్భిణీలు పౌష్టికాహారం తీసుకోవాలని, అప్పుడే పుట్టబోయే శిశువు బలంగా జన్మిస్తారని ఐసీడీఎస్‌ ప్రాజెక్టు అధికారి రేణుక అన్నారు. గురువారం అల్లాపూర్‌ డివిజన్‌, పర్వత్‌ నగర్‌, మినీ ఫంక్షన్‌ హాల్‌లో పోషణ మాస సంబరాలలో భాగంగా సామూహిక శ్రీమంతాలు, చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాలలో ఎన్నో రకాల సదుపాయాలు కల్పిస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంగన్‌వాడీలో లభించే బాలామృతం అందజేసి దానిని వాడే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో డాక్టర్‌ శ్రీ వాస్తవ రెడ్డి, సూపర్‌వైజర్‌ అనిత, జ్యోతి, మాధవి, శోభ, అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్స్‌, ఏఎన్‌ఎం తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఐసీడీఎస్‌ ప్రాజెక్టు అధికారి రేణుక తదితరులు